ప్రజాశక్తి

గురువారం 27 నవంబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు జ్ఞాపికను అందిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) చైర్మన్ చలసాని ఆంజనేయులు, చిత్రంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు తదితరులు

పల్లెల స్వయం సమృద్ధికి పాడి పరిశ్రమ దోహదం

- మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు
- ఘనంగా విజయ డెయిరీ వజ్రోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - హనుమాన్‌జంక్షన్ (ఉంగుటూరు) : గ్రామాల ఆర్థిక స్వయం సమద్ధికి పాడి పరిశ్రమ దోహదకారిగా ఉంటుందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఈ పరిశ్రమలో మహిళా సహకార సంఘాలను ప్రోత్సహించాలని సూచించారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లిలోని కామధేను ప్లాంట్లో బుధవారం కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ముందుగా ప్లాంట్ ఆవరణలో ఏర్పాటుచేసిన 650 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంటును ప్రారంభించారు. అలాగే సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వెంకయ్య నాయుడు మాట్లాడుతూ 1965లో కేవలం 646 లీటర్లతో మొదలైన కృష్ణా మిల్క్ యూనియన్ నేడు ఏటా 11 కోట్ల లీటర్ల పాలను సేకరిస్తూ రూ.1200 కోట్ల వార్షిక టర్నోవర్‌తో అద్భుతమైన ప్రగతి సాధించడం అభినందనీయమన్నారు. లక్షలాది మంది రైతుల కుటుంబాలలో వెలుగులు నింపిందన్నారు. అలాగే రైతులు కేవలం పాల ఉత్పత్తిపై ఆధారపడకుండా పెరుగు, నెయ్యి, పన్నీర్ వంటి వాటి జోడింపు (మిగతా 2లో)

విజయవాడలో కార్మిక, రైతు సంఘాల ధర్నాలో నేతలు



మచిలీపట్నంలో కార్మిక, రైతు సంఘాల ధర్నాలో నేతలు



లేబర్ కోడ్లపై ఆగ్రహం

- రైతాంగ సమస్యలపై నిరసన గళం
- ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల వ్యాప్తంగా ర్యాలీలు, సభలు
- ఎల్‌ఐసి ఉద్యోగుల కొవ్వొత్తుల ప్రదర్శన

కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కేంద్రంలోని మోడీ-బిజెపి ప్రభుత్వం విడుదల చేసిన నాలుగు లేబర్ కోడ్ల నోటిఫికేషన్‌ను రద్దు చేసే వరకూ ఐక్యంగా పోరాడాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల నేతలు పిలుపు నిచ్చారు. కేంద్ర కార్మిక, రైతు, కౌలు రైతులు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన బుధవారం ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు, సభలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ, నందిగామ, తిరువూరు, విస్సన్నపేట, కృష్ణాజిల్లా మచిలీపట్నం, ఉయ్యూరు, పెనమలూరు మండలం పోరంకిల్లో ఆందోళనలు చేపట్టారు. విజయవాడ ఏలూరు లాకుల వద్ద నుంచి అలంకార్ సెంటర్ ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్‌లో ధర్నా చేశారు. నేతలు, కార్యకర్తలు జెండాలను చేతబట్టి నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగ, కార్మికులకు ఉరితాళ్లుగా తయారైన లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినదించారు. అలాగే నందిగామ, తిరువూరు, విస్సన్నపేటల్లో ఆందోళనలు చేపట్టారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో కోనేరు సెంటర్ నుంచి నవకళా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ సభ నిర్వహించారు. అలాగే విజయవాడ, మచిలీపట్నంలో ఎల్‌ఐసి ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. మచిలీపట్నంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)



మచిలీపట్నంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఎల్‌ఐసి ఉద్యోగులు



విజయవాడలో నిరసన తెలుపుతున్న ఎల్‌ఐసి ఉద్యోగులు

అమరావతి జిల్లాపై వెనకడుగు !

- ఏటూ తేల్చుకోలేకపోతున్న ప్రభుత్వం
- సిఆర్‌డిఎతోనే రాజధాని ప్రాంతం కొనసాగింపు?

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాల పునర్విభజనపై ఏర్పాటైన మంత్రుల కమిటీ అమరావతి జిల్లా ఏర్పాటుపై నిర్ణయం తీసుకోలేదు. కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు కమిటీ ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపింది. అయితే అమరావతి జిల్లాపై మాత్రం ప్రతిపాదనలు పంపలేదు. దీనిపై కమిటీ డోలాయమానంలో ఉన్నట్లు తెలిసింది. జిల్లాలు, మండలాలు, గ్రామాల పునర్విభజనపై రాష్ట్ర ప్రభుత్వం ఐదు నెలల క్రితం ఏడుగురు మంత్రులు, ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పటికే కమిటీ పలు దఫాలుగా సమావేశమైంది. ఈ కమిటీతో ముఖ్యమంత్రి చంద్రబాబు వెలగపూడి సచివాలయంలో భేటి అయ్యారు. పోలవరం, మార్కాపురం, మదనపల్లె జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే రాజధాని అమరావతి ప్రాంతం సిఆర్‌డిఎలో కొనసాగుతున్నందున ఈ ప్రాంతంలో కొత్త జిల్లా ఏర్పాటుపై మరింత అధ్యయనం చేయాలని కమిటీ, ప్రభుత్వం నిర్ణయించాయి. ప్రస్తుతం అమరావతి జిల్లా ఏర్పాటు అంశాన్ని పక్కన పెట్టినట్లు తెలిసింది. రాజధాని అమరావతిగా ఉన్నా పాలనాపరమైన కార్యకలాపాలు ఇప్పటికీ విజయవాడ, గుంటూరు నుంచి కొనసాగుతున్నాయి. రాజధాని ప్రాంతమంతా గుంటూరు జిల్లా పరిధిలో ఉంది. సచివాలయం వెలగపూడిలో ఉన్నా క్షేత్రస్థాయిలో పాలనపరమైన నిర్ణయాలన్నీ గుంటూరు నుంచే నిర్వహించాల్సి వస్తోంది. రాజధానిలో వివిపిల పర్యటనలు గుంటూరు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలోనే, శాంతిభద్రతలన్నీ ఎస్‌పి పర్యవేక్షణలోనే కొనసాగుతున్నాయి. రాజధానికి ప్రత్యేక జిల్లా కేంద్రం లేకపోవడం వల్ల అమరావతికి పాలనపరమైన ప్రాముఖ్యత ఇంకా రాలేదు. దీంతో రాజధాని ప్రాంతం మొత్తాన్ని ఒక జిల్లాగా ఏర్పాటు ఆలోచన చేసినా పాలనపరంగా ఇప్పటికిప్పుడు అవసరం లేదని, కొంతకాలం తర్వాత నిర్ణయం తీసుకోవచ్చని ఉన్నతాధికారులు సూచించినట్లు తెలిసింది. పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు, గుంటూరు జిల్లాలోని తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలతోపాటు ఎన్‌టిఆర్ జిల్లాల పరిధిలోని మైలవరం, నందిగామ నియోజకవర్గాలను కలిపి అమరావతి జిల్లాగా మార్చాలనే ఆలోచన చేశారు. గతంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉండి ఏలూరు జిల్లాలోకి వెళ్లిన నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను మళ్లీ ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లోకి మార్పు చేయాలనే ఆలోచన చేసినట్లు తెలిసింది. నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలోకి, కైకలూరును కృష్ణాజిల్లా పరిధిలోకి తీసుకురావాలనే ఆలోచన చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం కృష్ణాజిల్లా పరిధిలో ఉన్న గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలనే ఆలోచన చేసినట్లు తెలిసింది. అయితే సిఆర్‌డిఎ ప్రాధాన్యత తగ్గే అవకాశం ఉందని కొందరు మంత్రులు అభిప్రాయపడినందున ప్రస్తుతానికి ఈ ఆలోచనను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్లు తెలిసింది. కొద్దికాలం వేచి చూసిన అనంతరం నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్ర విభజన తరువాత తొలిసారిగా వైసిపి ప్రభుత్వం 2022 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది.





రాయపూడిలోని సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సిపిఎం నేతలు బాబూరావు, నేతాజీ, రవి తదితరులు

శంకుస్థాపనలతో సరిపుచ్చొద్దు

- రాజధాని బైక్ ర్యాలీలో సిపిఎం నేతలు
- రైతుల ప్లాటకు రుణాలివ్వాలి
- నిర్మాణాలు పూర్తి చేసి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలి
- అసైన్డ్, జరీబు భూముల రైతుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లి, తుళ్లూరు : శంకుస్థాపనలతో సరిపుచ్చడమే తప్ప రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. రాజధానిలో పలు బ్యాంకులకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తాడేపల్లిలోని ఉండవల్లి సెంటర్ నుంచి రాజధానిలోని రాయపూడి వద్ద ఉన్న సిఆర్‌డిఎ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీనీ బాబూరావు ప్రారంభించారు. రాజధాని సమస్యలు పరిష్కరించాలని సిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట సిపిఎం శ్రేణులు నినాదాలు చేశాయి. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతిలో బ్యాంకులు, ఇతర ప్రభుత్వ సంస్థల ఏర్పాటు (మిగతా 2లో)



స్వరాత్మిక గాత్ర కచేరీ సూపర్

విజయవాడ : శ్రీ సద్గురు సంగీత సభ 32 వ వార్షిక సంగీత మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం రాత్రి శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నత్య కళాశాల ఆవరణలో స్వరాత్మిక శ్రీకాంత్ కచేరి ఉత్సాహపూరితంగా జరిగింది. పిన్న వయసులోనే ఎన్నో అవార్డులు సొంతం జేసుకున్న యువ గాయని స్వరాత్మిక గాత్రం నుండి శతిశుభగంగా జాలువారిన.. మందారి వర్ణం (మందారి రాగం.. ఆది తాళం..మైసూరు వాసుదేవచారి రచన), సరసీరు హాసన.. (నాట రాగం.. ఆది తాళం.. పులియుర్ శ్రీదురయస్వామి అయ్యర్ రచన), సామగాన లోలే... (హిందోళ రాగం.. రూపక తాళం.. పాపనాశం శివం రచన), వద్దు సుమీ చెప్పితిని.. (రీతి గౌళ రాగం.. ఆది తాళం.. అన్నమయ్య రచన) ఇత్యాది కీర్తనలను ప్రేక్షకులు ఎంతగానో ఆనందించారు. గాత్రానికి పోటీగా సాగిన వాయిద్య సంగీతం– ఆర్. దినకర్ (వయోలిన్), బి.వి.ఎస్.ప్రసాద్ (మదంగం), కె.వి.రామకష్ణ (ఘటం)ల ఊతం కార్యక్రమ విజయవంతానికి బాగా దోహదపడింది. కీర్తనల మధ్య మధ్య వాయిద్యకారుల ప్రత్యేక ప్రదర్శన "తన్యా వర్తనము" కూడా ఎంతగానో ఆకట్టుకుంది. సంగీత విద్వాంసులు శ్రీహరి శంకర శాస్త్రి స్మత్యర్థం కుమారులు వెంకట నాగభూషణ శాస్త్రి (యు.ఎస్.) సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత కచేరి బంద సభ్యులతో కలిసి "సభ" నాయకులు బి.వి.ఎస్.ప్రకాష్, పోపూరి గౌరీనాథ్, సుబ్రహ్మణ్యం, గాయత్రి తదితరులు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఘంటసాల పాటల పోటీల విజేతలు

విజయవాడ : మహానటి సావిత్రి కళా పీఠం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఔత్సాహిక గాయకుల మధ్య ఘంటసాల పాటల పోటీ నిర్వహించారు. కారుమంచి రాజు, పసుపులేటి శ్రీనివాసరావు, వెంకటేష్ వరసగా మొదటి మూడు స్థానాలను దక్కించుకున్నారు. నిడుమోలు రమా సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సినీ సంగీత కచేరీలో రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి, విష్ణుప్రియ, మల్లీశ్వరి, కష్ణకుమారి, సీత తదితరులు సినిమా పాటలు పాడి ప్రేక్షకుల్ని ఆహ్లాదపరిచారు. కళాపీఠం అధినేత్రి డా. పరుచూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వ్యాఖ్యాతగా కె.డేవిడ్ రాజు వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆడ్వొకేట్ హజరతయ్య గుప్తా, ప్రసూనారామన్, చిట్టిబాబు, 'జి.ఎస్.మెలోడీస్' శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.





అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

విజయవాడ : భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఎంకే బేగ్ స్కూల్ అజిత్ సింగ్ నగర్‌లో నిఫా, యునైటెడ్ ఎన్జీవో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు అంగడాల పూర్ణచంద్ర రావు, పాఠశాల హెచ్ఎం ఎం హుస్సేన్ తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మనం భిన్నత్వంలో ఏకత్వంలో జీవిస్తున్నామంటే ఆయన శ్రమేనని అన్నారు. ఆయన నిరంతర కషివలుడని, ప్రపంచ దేశాలు అంబేద్కర్‌ను నాలెడ్జికి చిన్నంగా చూస్తాయన్నారు. కొలంబియా యూనివర్సిటీ వారు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారని గుర్తుచేశారు. అనంతరం పిల్లలందరితో రాజ్యాంగ పీఠికప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నిఫా యునైటెడ్ ఎన్జీవో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, ఎన్జీవో సభ్యులు రవి, కొండలు, సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ ఎఐ ల్యాబ్ పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఎమ్మెల్యే సుజనా చౌదరి, సుజనా ఫౌండేషన్, సీడ్స్ ఇంపాక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రామరాజ్యనగర్‌లోని జివిఎన్ఆర్ఎంసి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ (ఐఓటీ) ఎఐ ల్యాబ్, లైబ్రరీని కలెక్టర్ లక్ష్మీశా బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో సీడ్స్ సిబ్బంది విద్యార్థులకు అందిస్తున్న బోధనా తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి డిజిటల్ ల్యాబ్ లో వారికి నేర్పుతున్న బోధనా పద్ధతులు , వారి అభ్యాస అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. సుజనా ఫౌండేషన్, సీడ్స్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐఎఎస్ ఆర్‌సియం రెడ్డి సహకారంతో గత ఏడాది రూ 38 లక్షల ఖర్చుతో ఈ ల్యాబ్‌ను ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభించారని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కలెక్టర్ కు తెలిపారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్య, తదితర వివరాలను ప్రధానోపాధ్యాయులు వివి రవి కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఎత్తిపోతల పథకం పున:ప్రారంభం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) బుధవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెనుగంచిప్రోలు గ్రామంలో మున్నేరు ఏటి ఒడ్డున గల ఎత్తిపోతల పథకం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ ఫండ్స్ నుండి రూ.12 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం చైర్మన్ నూతలపాటి కృష్ణ, జిల్లేపల్లి సుధీర్ బాబు, గజ్జి కష్ణమూర్తి, షేక్ ఆజాద్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల స్వయం సమృద్ధికి పాడి పరిశ్రమ దోహదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియలలో శిక్షణ పొంది ఆదాయం పెంచుకోవాలని సూచించారు. దేశంలో క్షీర విప్లవానికి, పాడి రైతుల సహకార సంఘ విజయానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ నాది పలికారన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్, గన్నవరం మాజీ శాసనసభ్యులు డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, పెద్ద సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలతో సరిపుచ్చొద్దు

(మొదటి పేజీ తరువాయి)

కోసం రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయిస్తే పదేళ్ల తర్వాత కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపనకు రావడం రాజధానిపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అశ్రద్ధకు నిదర్శనమన్నారు. ఇప్పుడైనా శంకుస్థాపనలతో సరిపెట్టకుండా రాజధాని రైతుల ప్లాట్లకు రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారని, బ్యాంకులు రుణం ఇస్తాయని ప్రచారం జరిగిందని, 18 నెలలు గడిచినా రైతులకు రుణం అందలేదని చెప్పారు. బడా కంపెనీలకు రుణాలిచ్చే బ్యాంకులు భూమిలిచ్చిన రైతులకు రుణాలు ఎందుకివ్వవని ప్రశ్నించారు. బ్యాంకులతోపాటు కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణాలు పూర్తి చేసి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని సెక్షన్ 94(3)ప్రకారం రాజధాని నిర్మాణం బాధ్యత కేంద్రానిదేనన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.లక్ష కోట్లు అవుతుందని ముఖ్యమంత్రి చెప్పారని, ప్రపంచ బ్యాంకు, ఏషియన్ బ్యాంకులు అప్పులు ఇచ్చాయని చెబుతున్నారని, అయితే వాటిని తామే తీర్చుతామని కేంద్ర మంత్రి ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం మూడు రాజధానులంటూ అమరావతిని ముక్కలు చేసి గుర్తింపు లేకుండా చేసిందని, కేంద్ర ప్రభుత్వం పదేళ్లయినా రాజధానికి చట్టబద్ధత ఎందుకు కల్పించడం లేదని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం మెతక వైఖరి వీడి కేంద్ర మంత్రితో రాజధాని సమస్యల పరిష్కారం పై గట్టి హామీ ఇచ్చేలా ఒత్తిడి తేవాలని, అందుకు సిపిఎం కూడా సహకరిస్తుందని అన్నారు. రాజధాని రైతులలో కొందరికి ప్లాట్లు ఇవ్వలేదని, జరీబు, అసైన్డ్ రైతుల సమస్యలతో పాటు కార్మికుల పింఛను పెంపు, పేదలకు గృహ నిర్మాణం తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటివరకు యువతకు ఉపాధి చూపించే ఒక్క పరిశ్రమ అయినా చంద్రబాబు చూపించగలరా అని ప్రశ్నించారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ రాజధానిపై నిధులు, విధులు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రాజధాని నిర్మాణానికి స్పష్టమైన ప్రకటన చేసి నిధులు రప్పించాలని, రైతులకు ఫ్లాట్లు చూపించ, ప్లాట్లను అభివృద్ధి చేయాలని కోరారు. అధికారులు స్పందించకపోతే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ, నాయకులు ఎం.భాగ్యరాజు, బి.వెంకటేశ్వర్లు, వి.వెంకటేశ్వరరావు, పి.బాబురావు, వి.దుర్గారావు, ఇ.రామారావు, ఆర్‌వి రాఘవయ్య, ఎస్కె పీరుసాహెబ్, కె.ఈశ్వర్ రెడ్డి, టి.భక్తిరెడ్డి, రామకృష్ణ, కె.మేరీ, డివి భాస్కర్‌రెడ్డి, వై.బర్నబాసు, పి.కృష్ణ, సంసోను పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు పెంచుకోవాలి

ప్రజాశక్తి-గంపలగూడెం: ప్రతి విద్యార్థి శాస్త్రీయ ఆలోచనలు పెంచుకోవడానికి విద్యార్థి దశ నుంచే గొప్ప శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు చదవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం రాంప్రదీప్ తెలిపారు. బుధవారం మండలంలోని వినగడప గ్రామ జడ్‌పి ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ శాస్త్రీయ దక్పథం అనే అంశంపై రాంప్రదీప్ మాట్లాడారు. తదుపరి టెన్త్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం కె. రవి కిరణ్, జెవివి మండల ప్రధాన కార్యదర్శి బి సైదులు, పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు ఎన్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

29న గన్నవరంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)/ఉంగుటూరు (గన్న వరం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుట కుగాను ఈ నెల 29. శనివారం గన్నవరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, తెలిపారు. ఈ జాబ్ మేళాలో కియా ఇండియా, ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫస్ట్సోర్స్ సొల్యూషన్స్ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, డామినీర్ - కస్టమైజ్డ్ ఇంటీరియర్ మాన్యుఫ్యాక్చరర్స్, జోయాలుక్కాస్ జ్యూవెలరీ, మెడ్ప్లస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సు వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని ఉపాధి అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, ఫార్మసి, పిజి పూర్తి చేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువత అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9494005725, 8885159008 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బొండాడ రాఘవేంద్రరావు 51వ జన్మదినాన్ని పురస్కరించుకొని, ఆయన స్వగ్రామమైన నాగాలంక మండలం పర్ర చివర గ్రామంలో ఈనెల 28వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బొండాడ ఫౌండేషన్ ప్రతినిధి వంగర శేషగిరిరావు తెలిపారు. బుధవారం అవనిగడ్డ ప్రెస్ క్లబ్ నందు మెగా వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో గుండె, మూత్రపిండాలు, నరాలు, ఎముకలు, చిన్నపిల్లలకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు, మహిళలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు చేయ నున్నట్లు చెప్పారు. బండాడ ప్రతినిధి భానుచంద్, ప్రెస్ క్లబ్ కార్యదర్శి పుట్టి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రత్నగిరికి పరామర్శ

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవిలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రావి రత్నగిరిని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న రత్నగిరిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సెయింట్ ఆన్స్ పాఠశాలలో మాక్ పార్లమెంట్

ప్రజాశక్తి-అవనిగడ్డ : భారత రాజ్యాంగం అమలు దినోత్సవాన్ని పురస్కరించుకొని అవనిగడ్డ సెయింట్ ఆన్స ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో విద్యార్థుల కు మాకు పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులుగా విద్యార్థులు జిఎస్టి సంస్కరణలపై చర్చ నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణల వల్ల దేశ ఆర్థిక అభివద్ధి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి అనే పలు అంశాలపై చర్చ నిర్వహించారు. విద్యార్థుల సంభాషణలు ఆహుతులను అలరించాయి. విద్యార్థుల్లో దేశ ఆర్థిక, రాజకీయ, ప్రజాస్వామ్య వ్యవస్థ ల పాలనాపరమైన చైతన్యం అవగాహన కలిగించేందుకు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాకు పార్లమెంట్ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ మౌళి థామస్ తెలిపారు, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లూర్దు మేరీ, వైస్ ప్రిన్సిపాల్ మౌళి పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధికి ఎన్నారైలు ముందుకు రావాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఉంగుటూరు - (గన్నవరం): విదేశాల్లో స్థిరపడిన తెలుగువారు తాము పుట్టిన గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. గన్నవరం మండలం బిబి.గూడెం గ్రామంలో రూ. 55 లక్షల వ్యయంతో దాతల సహకారంతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధికి నిధుల కొరత వల్ల జాప్యం జరుగుతుందని, దీన్ని నివారించేందుకు ఎన్నారైలు తమ సంపాదనలో కొంత భాగాన్ని స్వంత గ్రామాల అభివద్ధికి వెచ్చించాలని సూచించారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ స్థల దాతలు కాట్రగడ్డ వెంకట నారాయణ, వేమూరి గోపాలరావు కుటుంబ సభ్యులను, భవన నిర్మాణానికి రూ. 25 లక్షలు విరాళంగా ఇచ్చిన డాక్టర్ బోయపాటి రాజేంద్ర లక్ష్మీ ప్రసాద్, రూ.పది లక్షల విరాళం ఇచ్చిన నాగళ్ళ విజయలక్ష్మి (పద్మావతి), రూ. 3 లక్షల చొప్పున విరాళం ఇచ్చిన మాజీ సర్పంచ్ బోయపాటి బసవపూర్ణయ్య (నల్లబాబు), పిఎసిఎస్ అధ్యక్షులు బోయపాటి బుల్లయ్యలను ఈసందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, గ్రామ సర్పంచ్ దొప్పలపూడి జయలక్ష్మి, ఎంపీటీసీ మోరం నాగరాణి, ఎ.ఎం.సీ మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ



సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజార్ దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అవనిగడ్డ ఎంఎల్ఎ మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. బుధవారం అవనిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలోని నియోజక వర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పలు అంశాలపై 23 అర్జీలు సమర్పించారు. అర్జీలను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయి బాబు పరిశీలించి, పరిష్కారాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పరిషత్ అధికారులు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, డ్రైనేజీ శాఖల డి ఈ ఈ లు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన మెండు వెంకటరమణ ఇటీవల ప్రమాదంలో మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులకు 5 లక్షల రూపాయల చెక్కును బుధవారం బండి రామకృష్ణ అందజేశారు. జనసేన పార్టీ సభ్యత్వం కలిగిన మెండు వెంకటరమణ మృతిచెందిన విషయాన్ని మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డీసీఎంఎస్ చైర్మన్ బండిరామకృష్ణ జనసేన పార్టీ రాష్ట్ర అధిష్టానానికి తెలియజేసి 5.లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పాలసీ అందేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర పార్టీ నుండి వచ్చిన 5 లక్షల రూపాయల చెక్కును మెండు వెంకటరమణ కుటుంబ సభ్యులకు అందజేశారు. కూటమి నాయకులు గళ్ళాతిమోతి,కాగిత వెంకటేశ్వ రరావు, నూకల సాయి గణేష్,గడ్డం రాజు, పిచ్చేశ్వరరావు, నరేష్, నాంచారయ్య వెంకటరమణ, శివయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.



బీమా చెక్కు అందిస్తున్న దృశ్యం

నిధుల గోల్‌మాల్‌పై విచారించాలి

ప్రజాశక్తి- మోపిదేవి : మోపిదేవిలోని మత్స్యకారుల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో నాడు నేడు నిధులు గోల్‌మాల్‌పై లోతైన విచారణ నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర ప్రతినిధి కోలా బాలాజీ వర్మ డిమాండ్ చేశారు. పాఠశాలలో నాడు-నేడు నిధులు గోల్‌మాల్‌పై బుధవారం రెండో రోజు అధికారుల విచారణ జరిగింది. సమగ్ర శిక్ష అభియాన్ ఏ ఈ రాంబాబు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఫణి కుమార్ లు ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలను నమోదు చేశారు. ఫేస్- 2 నాడు నేడులో భాగంగా పాఠశాలకు మంజూరైన 50.99 లక్షలలో 30 లక్షలు విడుదల అయ్యాయని, వాటికి సంబంధించి ఇప్పటివరకు ఏమి పనులు చేశారు వివరాలు స్వయంగా పరిశీలించి నమోదు చేసుకున్నారు. నాడు నేడు పనులకు సంబంధించి పేరెంట్స్ కమిటీ తీర్మానం, సభ్యుల సంతకాలు లేకుండానే ప్రధానోపాధ్యాయులు వారి ఇష్టానుసారం పనులు చేసినట్లు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. వీటిని దష్టిలో ఉంచుకుని నిధుల గోల్‌మాల్‌పై లోతైన విచారణ నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

తైక్వాండో వారియర్స్ విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : ఈనెల 23,24వ తేదీల్లో నంద్యాల జిల్లాలో జరిగిన ఎనిమిదవ ఏపీ స్టేట్ లెవెల్ స్కై మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ -2025 పోటీలలో సుమారు 500 మంది పాల్గొనగా చల్లపల్లికి చెందిన సుబ్బు తైకాండో వారియర్స్ విద్యార్థులు పతకాలు సాధించారు. అండర్ 11 లోబో విభాగంలో రెండు బంగారు పతకాలు, ఐదు కాంస్య పతకాలు,8 రజిత పతకాలు, అండర్ 18 లోబో విభాగంలో మూడు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం, ఒక రజిత పతకం సాధించారు. కట్ట విభాగంలో అండర్ 18 ఏరో స్కై గ్రూపులో మూడు బంగారు పతకాలు, ఏరో స్కై మిక్స్ డబ్బులు విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించగా, అండర్ 14 విభాగంలో రెండు కాంస్య పతకాలు సాధించారు.కృష్ణాజిల్లా స్కై ప్రెసిడెంట్ మాస్టర్ పి. ఈశ్వర్, మాస్టర్ విశ్వం లు విద్యార్థులను కోచ్ మాస్టర్ కె.సుబ్బు కె. జాహ్నవిలను అభినందించారు.

బైక్‌ను ఢీకొన్న వ్యాను



ప్రజాశక్తి-ఉంగుటూరు (బాపులపాడు) : మండలంలోని బొమ్మల వారు వద్ద రామిలేరు వంతెనపై వ్యాను, బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయ పాల వ్యాన్ హనుమాన్‌జంక్షన్ వద్ద హఠాత్తుగా సర్వీస్ రోడ్డులోకి తిరగడంతో, వేగంగా వస్తున్న స్కూటర్ ఢీకొట్టింది. దీంతో స్కూటర్ కింద పడగా, అలాగే వెనుక వస్తున్న మరో బైక్ ఢీకొట్టుకుంది. ఈ సంఘటనలో స్కూటర్‌పై ఉన్న ఇద్దరు, బైక్ పై ఉన్న ఒక వ్యక్తి ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఆ సమయంలో అక్కడ ఇతర వాహనాలు తక్కువగా ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడ్‌మె న్‌పేట, బాపూజీ నగర్‌లో బుధవారం గుడివాడ టూ టౌన్ సిఐ హనీష్ వాహనా లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారుల నుండి సి బుక్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ డాక్యుమెంట్స్‌ను లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు అన్ని డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని, లేనిచో మోటారు వాహనాల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : .అవనిగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అవనిగడ్డ, మోపిదేవి మండలాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి సిడిపివో షహనాజ్ బేగం తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, అవనిగడ్డ మండల పరిధిలోని తుంగలవారిపాలెం గ్రామంలో జనరల్ అభ్యర్థి నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని, అదేవిధంగా పులిగడ్డ-1 నుండి బీసీ (బి) క్యాటగిరి నుండి దరఖాస్తు ఆహ్వానిస్తుండగా మోదుమూడి గ్రామానికి సంబంధించి జనరల్ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వేకనూరు2 టూ నుండి జనరల్ అభ్యర్థి ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. కాగా మోపిదేవి మండలం కప్తాన్ పాలెం సెంటర్ కు ఎస్ సి (సి) నుండి మహిళల ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు వివాహితులు మాత్రమే అయి ఉండాలని, స్థానికులు అయి ఉండాలని, నివాస ధ్రువీకరణ పత్రం ఆరు నెలలు దాటనిది, డోర్ నెంబర్ తో సహా నకలు జత చేయాలని 1౹7౹ 2025 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని, వారు కచ్చితంగా 10వ తరగతి పాస్ అయి ఉండాలని సిడిపిఓ తెలిపారు. డిసెంబర్ మూడో తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తుదారులు అందజేయాలన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లిలో 12వ అంగన్వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న సహాయకురాలు పోస్టునకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు మొవ్వ సమగ్ర శిశు సేవ పథక అభివద్ధి అధికారిణి ఎస్ ప్రసన్న శ్వనాథ ఒక అధికారిక ప్రకటనలో ప్రకటించారు. స్థానికులైన వివాహిత మహిళలు మాత్రమే ఈ పోస్ట్ కు దరఖాస్తు చేయవలెనన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను డిసెంబర్ మూడో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మొవ్వ ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.



29న కెబిఎన్‌లో యుజిసి జాతీయ సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : యుజిసి సహకారంతో తమ కళాశాల ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యాన ఈ నెల 29న ఒక రోజు నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించ నున్నట్లు కెబిఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు చెప్పారు. బుధవారం కళాశాల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాన్ఫరెన్స్ గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఎక్స్ ప్లోరింగ్ జండర్ ఐడెంటిటీ అండ్ సోషల్ చేంజ్ త్రూ ఉమెన్ స్టడీస్' అనే అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ జిఎస్‌టి అడిషినల్ కమిషనర్ ఎన్.సౌమ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.ఉష కీలకోపన్యాసం చేస్తారని, పాండిచ్చేరి యూనివర్శిటీ ప్రొఫెసర్ ఆశిత, నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ సరస్వతి రాజు అయ్యర్, ఇమిస్ ఫార్మాస్యూటికల్స్ ఎండి వి.నాగలక్ష్మి వక్తలుగా పాల్గొంటారన్నారు. సదస్సు కోసం సమర్పించిన పత్రాల సంకలనాన్ని ప్రారంభ సభలో ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. హిందూ హైస్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమం కూటమితోనే సాధ్యం

- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఆర్యవైశ్యుల అభ్యున్నతి, సంక్షేమం సిఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని పెనుగొండ ఊరి పేరును వాసవి పెనుగొండగా మారుస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ రాకేష్ విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ ఎదురుగా ఉన్న తన కార్యాలయం వద్ద మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, వాసవి మాత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం రాకేష్ మీడియాతో మాట్లాడుతూ రాజధాని అమరావతిలో ఆరున్నర ఎకరాల్లో పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటుకు భూమి కేటాయింపు, వాసవి మాత జన్మస్థలమైన పెనుగొండ పట్టణ పేరును వాసవి పెనుగొండగా నామకరణం చేయడం చంద్రబాబుకే సాధ్యపడిందన్నారు. అదే విధంగా పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతులను ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించింది చంద్రబాబు నాయుడు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్పొరేటర్ గుడివాడ రాఘవ నరేంద్ర, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



కాపునాడు స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయండి

- ఆకుల శ్రీనివాస్ పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కాపు సామాజిక వర్గంలో చైతన్య దీప్తిని రగిలిస్తున్న కాపునాడు స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని కాపునాడు నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ పిలుపునిచ్చారు. నవంబరు 30న విజయవాడలో జరిగే కాపునాడు స్వర్ణోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని జింఖానా క్లబ్ వద్ద ఉన్న కందుకూరి కల్యాణ మండపంలో బుధవారం సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీకి అధ్యక్షత వహించిన ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ కాపునాడు స్వర్ణోత్సవం మహాసభ ను సంఘటితంగా జయప్రదం చేయడానికి చేయవలసిన ప్రణాళికలు గురించి వివరించారు. కృష్ణా జిల్లాకు వంగవీటి మోహన రంగా పేరు పెట్టాలన్న అభిప్రాయం కాపు సామాజిక వర్గంలో స్పష్టంగా ఉందని, ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ళ సుబ్రమణ్యం మాట్లాడుతూ మన సమస్యల పరిష్కారం కోసం కాపునాడు కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ అర్బన్ కాపునాడు కమిటీ అధ్యక్షులు పరుచూరి కరుణాకర్, మాచవరంలోని దాసాంజనేయ దేవాలయ ధర్మకర్త సోడిశెట్టి కష్ణప్రసాద్, మా అర్ట్ బాబి, రాయలసేన ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లపై ఆగ్రహం

- పలుచోట్ల ర్యాలీలు, నిరసనలు

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు బుధవారం ఆందోళనకు దిగాయి. విజయవాడ, విస్సన్నపేట, నందిగామ, తిరువూరులో నేతలు ఆందోళనలు చేశారు. కార్మికులకు, రైతులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, లేకుంటే మోడీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

విజయవాడ : కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కేంద్రంలోని మోడీ-బిజెపి ప్రభుత్వం విడుదల చేసిన నాలుగు లేబర్ కోడ్ల నోటిఫికేషన్‌ను రద్దు చేసే వరకూ ఐక్యంగా పోరాడాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల నేతలు పిలుపు నిచ్చారు. రైతు, కౌలు రైతులు, కార్మికులు, ప్రజాసంఘాలు, మీడియా సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ ఏలూరు లాకుల వద్ద నుంచి అలంకార్ సెంటర్ ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్‌లో ధర్నా చేశారు. నేతలు, కార్యకర్తలు జెండాలను చేతబట్టి నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగ, కార్మికులకు ఉరితాళ్లుగా తయారైన లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినదించారు. అనంతరం రైతుసంఘం జిల్లా కార్యదర్శి యలమందరావు, సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఎఐటియుసి జిల్లా నాయకులు యం. సాంబయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల పెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, ఎఐయుటియుసి రాష్ట్ర ధ్రాన కార్యదర్శి సుధీర్, ఏఐకెఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.వెంకట రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.హరినాథ్, టియుసిసి రాష్ట్ర నాయకులు మరీదు ప్రసాద్, వృత్తిదారుల సంఘం నాయకులు కె.రామాంజనేయులు, ఏఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీబీ సత్యనారాయణ, శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి , సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కెఆర్‌కె మూర్తి, కె.ఉమామహేశ్వరరావు, ఆర్‌వి.నరసింహారావు, దయా రమాదేవి, ఐద్వా జిల్లా కార్యదర్శి కాజ సరోజ, సిఐటియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఏ.వెంకటేశ్వరరావు, పిఎన్‌ఎం నాయకులు జివి రంగారెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు ఎం బాబూరావు, ఎ.సుబ్బారావు, ఎస్.సుబ్బారెడ్డి, ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, రాష్ట్ర నాయకులు ఒ.శాంతి శ్రీ, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, ఎఐటియుసి నగర అధ్యక్షులు ఆంజనేయులు పాల్గొన్నారు. **విజయవాడ సిటీ :** విజయవాడ 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు ప్రాంతంలో సిఐటియు ఆధ్వర్యంలో లేబర్ కోడ్ల ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బి.సత్యబాబు మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ఇవి నారాయణ, ఉపాధ్యక్షులు ఎస్.డి కరిముల్లా, వి సాములు, నూకాలమ్మ, సుబ్రహ్మణ్యం, చందు తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నందిగామ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు, చిరుమామిళ్ల హనుమంతరావు, కె గోపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. **విస్సన్నపేట :** విస్సన్నపేట గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, నాయకులు మర్రిబోయిన అప్పారావు గంజినబోయిన రాము భాష గాబ్రెల్. శ్రీనివాసరావు రాము కార్మికులు పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు బోసుబొమ్మ బస్టాప్ సెంటర్‌లో కార్మికులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, ఎస్వీ భద్రం, ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **విజయవాడ అర్బన్ :** నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడ గవర్నరుపేటలో ఎల్ఐసి ఉద్యోగులు బుధవారం భోజన విరామం సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, డివిజనల్ జాయింట్ సెక్రటరీ, మచిలీపట్నం డివిజన్ వర్కింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ సిహెచ్.కళాధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ జనరల్ సెక్రటరీ పి.కష్ణ పాల్గొని మద్దతు తెలిపారు. డివిజన్ నాయకులు, ఎస్.ఎం.కె.ప్రసాద్, ఇ.వి.తులసీరావు, బ్రాంచ్ నాయకులు శ్రీనివాస్, రాజశేఖర్, .రహీముద్దీన్, .సాయి ప్రసాద్ పాల్గొన్నారు.



విస్సన్నపేటలో సిఐటియు నేతల ఆందోళన



తిరువూరులో నేతల ఆందోళన



నందిగామలో సిఐటియు నేతల నిరసన



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

మాక్ అసెంబ్లీలో అదరగొట్టిన రాకేష్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : స్థానిక చిట్టినగర్ కేఎల్ రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ నందు బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. విద్యార్థులు శాసనసభ సభాపతి అయ్యన్నపాత్రుడు, ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, తోపాటు రాష్ట్ర మంత్రుల వేషధారణలతో అధికార ప్రతిపక్ష పాత్రలతో శాసనసభ కార్యక్రమాల నిర్వహణ సమయంలో అధికార ప్రతిపక్ష నేతలు అనుసరించే విధానాన్ని చక్కగా ప్రదర్శించారు. ప్రశ్నోత్తరాల సమయం వాడి వేడిగా సాగింది. లా అండ్ ఆర్డర్, ప్రభుత్వ పథకాలు, దేవాలయాల నిర్వహణ, బుడమేరు వరదలకు తీసుకున్న నివారణ చర్యలు, సంక్షేమ హాస్టల్‌లో కలుషిత ఆహారం, విద్యారంగంలో లోపాలు వంటి ప్రజా సమస్యల ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నలు సందించగా అధికార పక్షంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు వాటికి ధీటైన సమాధానాలను వివరణలతోసహా ఇవ్వడం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో డైరెక్టర్ ఎన్వి రావు, వైస్ ప్రిన్సిపల్ రేణుకాదేవి, ఉపాధ్యాయులు ఎండి షకీలా, మమత పాల్గొన్నారు.



నూతన దంపతులకు ఉచిత అంతరాలయ దర్శనం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో సామాన్య యాత్రికులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. కొత్తగా వివాహం చేసుకొని అమ్మవారి ఆశీస్సుల కోసం దుర్గ గుడికి విచ్చేసే నూతన వధూవరులకు ఉచిత అంతరాలయ దర్శనంతోపాటు వేద ఆశీర్వచనం, ప్రసాదాలను అందిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల ఇంద్రకీలాద్రిపై ప్రతిరోజు రాహుకాలం (మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల) సమయంలో సామాన్య యాత్రికులకు ఉచిత అంతరాలయ దర్శనం కల్పిస్తున్న సంగతి తెలిసిందే.

మహిళలపై దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు : జడ్జి

ప్రజాశక్తి- నందిగామ : మహిళలకు ప్రభుత్వాలు అనేకమైన సంరక్షణ చట్టాలు అమలు చేస్తున్న ఇప్పటికీ శారీరక హింసకు, మానసిక మనో వేదనకు గురవుతున్నారని, దోషులకు కఠినంగా శిక్షించటం జరుగుతుందని నందిగామ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.వందన హెచ్చరించారు. జాతీయ వరకట్నపు నిషేధపు దినోత్సవం, రాజ్యాంగపు న్యాయ దినోత్సవం సందర్భంగా నందిగామ వెలుగు ప్రాజెక్ట్ కార్యాలయంలో నందిగామ బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యుడు వేల్పుల కిషోర్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం జరిగింది. సదస్సులో జడ్జి వందన మాట్లాడుతూ మహిళలు ప్రతిక్షణం మానసిక హింసకు గురవుతున్నారని, ఇటువంటి వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు షేక్ దాదా హుస్సేన్, బొమ్మిశెట్టి ఫణి కుమార్, కొమ్మినేని మౌళేశ్వరరావు, పాల్గొన్నారు.



వైసిపి పతనానికి సజ్జలే కారణం : బుద్దా వెంకన్న

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : వైసిపి నాయకుడు సజ్జల రామకష్ణారెడ్డి పగటి కలలు కనటం మానుకోవాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. సిఎం చంద్రబాబుపై సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న బుధవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. వైసిపి తిరిగి అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని, అసలు వైసిపి పతనానికి సజ్జల రామకృష్ణారెడ్డే ప్రధాన కారణమంటూ విమర్శించారు. వైసిపి నాయకులు త్వరలో కె.ఎ.పాల్ పార్టీలోకి, సజ్జల రామకృష్ణారెడ్డి జైలు వెళ్లటం ఖాయమన్నారు. వైసిపి నేతల అహంకార పూరిత వైఖరి వల్లే 151 సీట్లు ఉన్న ఆ పార్టీకి 11 సీట్లు ఇచ్చి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు.



లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా నిరసనలు



బందరులో మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : కేంద్ర ప్రభుత్వ నోటిఫై చేసిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మచిలీపట్నం నగరంలో బుధవారం సిఐటియు, ఏఐటియుసి, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కిసాన్ కాంగ్రెస్ తదితర ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కోనేరు సెంటర్ నుంచి నవకళా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాలు హరిస్తూ, కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేలా కొత్త చట్టాలు అమలులోకి తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్రం రాకముందే పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి పది నుంచి అదనంగా మరో రెండు గంటలు కలిపి కార్మికులతో పని చేయించుకునే విధంగా కంపెనీలకు అనుకూలమైన చట్టాలు తీసుకురావడం కార్మికులకు ప్రయోజనం చేయడమా అని ప్రశ్నించారు. కృష్ణాజిల్లా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి అంగత రమాదేవి మాట్లాడుతూ అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులను పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడికి గురి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు,కౌలురైతుసంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మణస్వామి, కృష్ణాజిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది రామ్మోహన రావు, రాష్ట్ర మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శీలం నారాయణరావు, సిఐటియు జిల్లా క్లస్టర్ కార్యదర్శి బేత శ్రీనివాసరావు, బూర సుబ్రమణ్యం, సిఐటియు మచిలీపట్నం మండల కన్వీనర్ చిరువోలు జయరావు, సిపిఐ నాయకులు జమలయ్య, కాంగ్రెస్ పార్టీ మచిలీపట్నం ఇన్చార్జ్ అబ్దుల్ మతిన్, నల్లబోలు కుమారి, తుమ్మల కాళీ ప్రసాద్, సుంకర ప్రసాద్ పాల్గొన్నారు.

అలాగే కార్మిక, కర్షక, అల్పాదాయ వర్గాలకు వ్యతిరేకంగా పనిచేసే ప్రభుత్వాలు కూలిపోక తప్పదని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, మచిలీపట్నం డివిజన్ నాయకులు గాడేపల్లి కిషోర్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల అమలు కోసం గెజిట్ విడుదల చేసిన నేపథ్యంలో దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సాయంత్రం మచిలీపట్నం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు డి. వాసు, వై. స్వామినాథ్, ఎ. మల్లికార్జున ప్రసాద్, ఎ. శ్రీనివాస రావు, ఎస్ వి రత్నారావు,బి హెచ్. మాధుర్, రాధకృష్ణమూర్తి, ఎస్. ధనుంజయ రావు, పి. నాగయ్య తదితరులు నాయకత్వం వహించారు.



ఉయ్యూరులో...



కంకిపాడులో...

ప్రజాశక్తి-ఉయ్యూరు : కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు ఉయ్యూరు మండల కన్వీనర్ బి రాజేష్ అన్నారు. లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ బుధవారం ఉయ్యూరు సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం పట్ల తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు షరీఫ్ జియా, కిరణ్, నాగబాబు, షఫీ, పోతురాజు, జమదగ్ని తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్ నోటిఫై చేయడాన్నీ ఖండిస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పోరంకి సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించి మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు షేక్ కాసిం, సిఐటియు నాయకులు లక్ష్మీ ప్రసన్న, సరళ, డేవిడ్ మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.


కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకువచ్చి బావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషి మరువరానిదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ నిధులు రూ.64.70 లక్షలతో నిర్మించిన సైన్స్, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయ హాలు భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమ తుల్యతకు మొక్కలునాటి సంరక్షించడం విద్యార్థులు అల వరుచుకోవాలన్నారు. అనంత రం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార పంపిణీ, నాణ్యత పరిశీలించి పరిశుభ్రత, ఆరోగ్యానికి తీసుకోవలసిన జాగ్రత్తలు విద్యార్థులకు తెలియజేశారు. ఉయ్యూరు చైర్మన్ సత్యనారాయణ, డీవైఈఓ పద్మారాణి, ఎం ఈఓ సుధారాణి, హెచ్ఎం నాగేశ్వరరావు, పాఠశాల అభివద్ధి కమిటీ సభ్యులు శివసాయిప్రసాద్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వెంట్రప్రగడ పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ



ప్రజాశక్తి - పెదపారుపూడి (గుడివాడ) : ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్యను మెరుగు పరచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డిఎం అండ్ హెచ్ఓ) డాక్టర్ పి యుగంధర్ పిహెచ్‌సి వైద్యులను ఆదేశించారు. బుధవారం పెదపారుపూడి మండలంలోని వెంట్రప్రగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు ఆరోగ్య సంచాలకులు (ఎడి) డాక్టర్ కె.వి.ఎన్.ఎస్ అనిల్ కుమార్, డాక్టర్ పి యుగంధర్‌లు ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం రోగులను, గర్భిణీలను పిహెచ్సిలో వారికి అందే సేవలను గూర్చి ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సిడి సర్వే, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, ఇతర అన్ని కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఎలా జరుగుచున్నాయో పిహెచ్‌సిలోని అన్ని విభాగాలు పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. వైద్యులు బి.వి.ఆర్ సందీప్, ఎ. దివ్యకష్ణ, ఎస్ఓ సిఎఫ్‌డబ్ల్యూ వై. గోపాలకష్ణ, మచిలీపట్నం ఎస్వో వి.ఆనంద్, పీహెచ్సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా షష్టి కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి- మోపిదేవి: మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్య షష్టి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విచ్చేసి కల్యాణ మహోత్సవం తిలకించారు. దేవాదాయ శాఖ తరపున, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అనువంశిక ధర్మకర్తలు చల్లపల్లి జమిందారులు యార్లగడ్డ వంశీయుల తరపున స్వామివారికి, ఉభయ దేవేరులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు పట్టు వస్త్రాలు సమర్పించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరినాథ్, దేవస్థానం సూపరింటెండెంట్ అచ్యుత మధుసూధనరావు దేవాలయ అధికారులు పాల్గొన్నారు.




ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజాను సత్కరిస్తున్న దృశ్యం

పెరికల అభివృద్ధికి కృషి : వనపర్తి

ప్రజాశక్తి-పమిడిముక్కల : ఉద్యోగ ఉపాధి సంక్షేమ కార్యక్ర మాలలో పెరికల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పెరికే సంఘం చైర్మన్ వనపర్తి వీరభద్రరావు అన్నారు. బుధవారం ఆయన పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ తెలుగు దేశం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు. సంక్షేమంతోపాటు పలు అభివృద్ధి కార్యక్ర మాలు చేస్తోందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు కందిమల్ల సుబ్రహ్మణ్యం, ప్రవీణ్, పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -నాగాయలంక : మండల పరిధిలో గల వక్కపట్లవారిపాలెం గ్రామ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బుధవారం నాగాయలంక మండలం వక్కపట్లవారి పాలెంలో రూ.32 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ భవన నిర్మాణానికి ఏడు సెంట్లు స్థలాన్ని విరాళంగా ఇచ్చిన అంబటి వెంకటలక్ష్మికి అభినందనలు ఎంఎల్ఎ తెలిపారు. అనంతరం రైతన్నా మీ కోసం కరపత్రాలు ఆవిష్కరించి రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబటి శ్యాంప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరి ప్రసాద్, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీఓ కేఎం చంద్రశేఖర్, పంచాయతీరాజ్ శాఖ డీఈఈ పగడాల సురేష్, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు (చినబాబు) పాల్గొన్నారు.



కష్టపడే వారికి గుర్తింపు : బండి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : జనసేన పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తూ కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని ఉమ్మడి కృష్ణా జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం మంగళగిరి ఏపీఐఐసీ కార్పొరేషన్ కార్యాలయంలో ఏపీఐఐసీ డైరెక్టర్‌లుగా నియమితులైన జనసేన పార్టీ నాయకులు మండలి రాజేష్, చనమల్ల చంద్రశేఖర్, పోతూరి నారా యణస్వామి, మహేష్‌లను అభినందించారు. పదవి బాధ్యత స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం డైరెక్టర్లతో కలిసి చైర్మన్గా నియమితులైన మంతెన రామరాజును సత్కరి ంచారు.

వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : సుంకర

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని పొను కుమాడు గ్రామంలో ఐఎఫ్ఎఫ్‌సిఓ (ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఫీల్డ్ డే కార్యక్రమంలో రైతులకు ఆధునిక నానో సాంకేతికత, ఆధారిత ఎరువులు, పోషకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పొనుకుమడు పిఎసిఎస్ చైర్మన్ సుంకర రాజేష్ మాట్లాడుతూ వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్ఎఫ్ ఓ రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ ఎం.ఆర్. శ్రీ రాజు 'ఐఎఫ్ఎఫ్ సి ఓ నానో యూరియా ప్లస్', 'ఐఎఫ్ఎఫ్ సి ఓ నానో డాప్', 'ఐఎఫ్ఎఫ్ సి ఓ నానో జింక్', 'ఐఎఫ్ఎఫ్ సి ఓ నానో కాపర్' వంటి నానో ఉత్పత్తుల ప్రయోజ నాలు, వాటి వినియోగ పద్ధతుల గురించి వివరించారు. ఐఎఫ్ఎఫ్ సి ఓ జిల్లా మేనేజర్ నంద కిషోర్ రెడ్డి సమకాలిక వ్యవసాయ పద్ధతులు, డ్రోన్ స్ప్రేయింగ్, సాంకేతికత ప్రయోజ నాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి రమేష్, పిఎసి ఎస్ సిఇఓ రాఘవ, పిఎసి ఎస్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-మొవ్వ : నిబంధనలను తరలించి రంగు మారిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో రైతులు నూర్చి పరదాలలో ఆరబెడుతున్న ధాన్యాన్ని బుధవారం పర్యటించి పరిశీలించారు. ఆరు కాలం కష్టించి వరిధాన్యం పండించిన రైతులకు, కౌలు రైతులకు మొంథా తుఫాన్ వల్ల మానుగాయ వచ్చి ఎక్కువ శాతం ధాన్యం రంగు మారి నష్టం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా రైతు సంఘం అధ్యక్షులు కోసూరు శివ నాగేంద్రం, వ్యవసాయ కార్మిక సంఘం కష్ణాజిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

విజయవాడ : 75వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. విజయవాడలో బెజవాడ బార్ అసోసియేషన్ ప్రాంగణంలో రాజ్యాంగ పీఠిక నమూనాను ఏర్పాటు చేశారు. కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులు, న్యాయ ఉద్యోగులు అందరూ దేశభక్తితో భారతీయ రాజ్యాంగ ప్రియాంబుల్ ప్రతిజ్ఞను చేశారు. బెజవాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎకె బాషా ఆధ్వర్యంలో భారత రాజ్యాంగంలో మహిళా ప్రాముఖ్యతపై సీనియర్ న్యాయవాదులతో గోష్టి నిర్వహించారు. విజయవాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠిక స్ఫూర్తిని ఆయన గుర్తు చేశారు. విజయవాడ నగరపాలక సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, నగర కమిషనర్ ధ్యానచంద్ర, అదనపు కమిషనర్లు ఎ రవీంద్రరావు, డాక్టర్ డి చంద్రశేఖర్‌లు, ఉద్యోగులు రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం నిర్వహించారు. **విజయవాడ సిటీ:** రాజ్యాంగం ఆమోద దినోత్సవం వేడుకలు విజయవాడ రైల్వే డివిజన్‌లో జరిగాయి. స్థానిక రైల్వే డిఆర్‌ఎం కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలలో విజయవాడ డివిజన్ డిఆర్‌ఎం మోహిత్ సోనాకియా, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇన్‌ఫ్రా)పి ఇ. ఎడ్విన్, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఆపరేషన్స్) కొండా శ్రీనివాసరావు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. **వీరులపాడు** : వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ


బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్


వీఎంసిలో రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం చేస్తున్న మేయర్, కమిషనర్

కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ నిమ్మల రాజేంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు. జుజ్జూరులో రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. ముందుగా గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నాయకులతోపాటు మండల అభివృద్ధి అధికారి రూపవతి, డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు గ్రామ సర్పంచి రామావత్ కోటి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల గ్రంథాలయం అధికారి అమరేశ్వర్, కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ సుబ్బారావు, సీనియర్ జర్నలిస్ట్ రాజు, లాల్ అహ్మద్ గౌస్, పాల్గొన్నారు. **మైలవరం** : భారత రాజ్యాంగ దినోత్సవం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో తోపాటు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. **చందర్లపాడు:** చందర్లపాడులోని స్థానిక ఎస్సికేయం జడ్‌పిహెచ్ స్కూల్లో హెచ్‌ఎం ప్రధానోపాధ్యాయురాలు ఎన్ శ్రీలత ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో మార్క్ అసెంబ్లీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కోనాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నారాయణరావు, స్కూల్ ఛైర్మన్ మార్నపూడి జాన్ కోటయ్య ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందర్లపాడు మాజీ జెడ్పిటిసి, కోనాయపాలెం పిఎసిఎస్ బ్యాంక్ ఛైర్మన్ వాసిరెడ్డి ప్రసాద్, నందిగామ హోమియోపతి డాక్టర్ భాను ప్రసాద్ హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కంచికచర్ల** : కంచికచర్ల మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్లో కవి, రచయిత తంగిరాల సోని భారత రాజ్యాంగం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్ట్ ఘంటా విజయ్ కుమార్, కెవి మెడికల్ కాలేజీ కరస్పాండెంట్ కెవి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ చీఫ్ ఇంజినీర్ పి.శివ రామాంజనేయులు.. అంబేద్కర్, భరతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీర్లు కె.వి. నాగేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ పి. శ్రీదేవి, జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) కృష్ణ మోహన్, ఫ్యాక్టరీ మేనేజర్ శేషాద్రి శేఖర్, పాల్గొన్నారు. **తిరువూరు** : భారతరాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని తిరువూరులో నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 3 కె వాక్‌ను జడ్జి సూర్యతేజ ప్రారంభించారు. రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆర్డీవో మాధురి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. **నందిగామ** : నందిగామ గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవం వేడుకలను నిర్వహించారు.అంబేద్కర్ చిత్రపటానికి గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు పూలమాలవేసి నివాళు లర్పించారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని గంటేల వెంకట జోగయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), నందిగామ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి శ్యామసుందరరావు,హాజరయ్యారు. అనంతరం పాఠశాలలో మాక్ అసెంబ్లీ నిర్వహించారు

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి : సిఐటియు



ప్రజాశక్తి-మైలవరం : పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని పుల్లూరు గ్రామపంచాయతీ కార్మికు లను బుధవారం కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ పుల్లూరు పంచాయతీలో ఏడుగురు పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని వారికి కనీస వేతనం రూ.పది వేలు కూడా ఇవ్వటంలేదని, రెండు సంవత్సరాలుగా మౌలిక సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి పంచాయతీ కార్మికులకు మౌలిక సౌకర్యాలతోపాటు పెండింగ్లో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇంటి పన్ను ఆన్‌లైన్‌లోనే వసూలు చేయాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామ పంచాయతీలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని డిపిఒ లావణ్య కుమారి బుధవారం సందర్శించారు. అదేవిధంగా గ్రామంలోని శానిటేషన్ పనులను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్తు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలో అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ప్రతి పంచాయతీలో ఇంటి పన్ను వసూలు ఆన్‌లైన్‌లోనే వసూలు చేయాలని తెలిపారు. రెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కోతుల వాగులో ప్రజలు చెత్త వేయకుండా వాగునకు రెండు వైపులా మెస్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం గ్రామ సర్పంచి మల్లాది రాణి, కూనపరాజుపర్వ సర్పంచి ఎం వెంకటేశ్వరావు, ఇన్చార్జి ఎంపీడీవో ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని రంగాపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల విద్యాలయం, కస్తూరిబా విద్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా జరిగిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ - విశ్వజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ తెలుగు అధ్యాపకులు ముంగా జయరాజు, ఎస్ లిల్లెమ్మ, చాట్ల విజయకుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన పోటీలు విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించేలా ఉందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు తబిత, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ హన్న, రిటైర్ ఉపాధ్యాయులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీలో ఎంబిఎం పాఠశాల విద్యార్థిని



ప్రజాశక్తి-మైలవరం : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినులతో మాక్ అసెంబ్లీ నిర్వహించింది. బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీలో మైలవరంలోని మాదాల బుల్లయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని షేక్ గుల్షన్ ఆరా.. ఎమ్మెల్యే పాత్రను పోషించింది. ఎమ్మెల్యే పాత్రను షేక్ గుల్షన్ ఆరా పరిణితి చెందిన రాజకీయ నాయకురాలిగా పాత్రను పోషించి ప్రతిభను కనబరిచినందుకు పాఠశాల విద్యాశాఖ సర్టిఫికెట్, మెడల్‌తో సత్కరించారు. ప్రధాన ఉపాధ్యాయులు వై.రాజశేఖర్, ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఆర్థిక అభివృద్ధికి మిద్దె తోటలు దోహదం



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కుటుంబ ఆరోగ్య ఆర్థిక అభివృద్ధికి మిద్దె తోటలు దోహదపడతాయని కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు పేర్కొన్నారు. గత పది మాసాలుగా తాను నిర్వహిస్తున్న మిద్దె తోట అనుభవాలను బుధవారం ట్రస్ట్ కార్యాలయంలో విలేకరులతో పంచుకున్నారు. అతి తక్కువ ఖర్చుతో (జీరో బడ్జెట్‌తో) గణనీయమైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు. మహిళల కోణంలో మిద్దె తోట ఒక ఆర్థిక భరోసా, ఆరోగ్య బీమాలా నిలుస్తుందన్నారు. మిద్దె తోటలు పర్యావరణపరంగా గాలి కాలుష్యాన్ని, ఇంటి ఉష్ణోగ్రతను తగ్గించి భవనాన్ని చల్లగా ఉంచడంలో దోహదపడతాయని పేర్కొన్నారు. మిద్దె తోటలు పెంచాలని ఆసక్తి కలిగిన వారికి తమ సంస్థ ప్రోత్సాహకంగా కూరగాయ విత్తనాలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలి



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో కొనసాగాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యలతో కలిసి ఎమ్మెల్యే శ్రీరామ రాజగోపాల్ తాతయ్య మంగళవారం సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. జగ్గయ్యపేట నియోజకవర్గం -మునేరు పాత ఆనకట్ట వద్ద తాత్కాలిక రింగ్ బండ్ ఏర్పాటుకు రూ.71.45 లక్షలు, కంచెల- వేదాద్రి ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) పథకం అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేయాలని విన్నవించారు. దీని చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన నిధులు త్వరితగతిన మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఆలయం వద్ద బహిరంగ వేలం పాటలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. పాలు, బియ్యం, వగైరాలు పోగు చేసుకొని హక్కుకు రూ.15,35,000, పొంగల్ షెడ్ వద్ద గ్యాస్ రుసుము వసూలు చేసుకొను హక్కుకు రూ.2,55,000, భక్తుల ఫోటోలు తీసుకొను హక్కుకు రూ.75,000, కొండ కింద క్యాంటీన్ నిర్వహించుకొను హక్కుకు రూ.1,82,000 రూపాయలు వెరసి పైపాటలు ద్వారా రూ.20,47,000 ఆదాయం చేకూరిందని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కే రవీంద్ర భరద్వాజ్, సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి కె.సాంబశివరావు తెలిపారు.

15 నుంచి తిరుపతమ్మ దీక్ష మాల ధారణ

ప్రజాశక్తి -పెనుగంచిప్రోలు

తిరుపతమ్మ అమ్మవారి మండల దీక్ష మాల ధారణ డిసెంబర్ 15 నుంచి జనవరి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కిషోర్ కుమార్ తెలిపారు. అదేవిధంగా శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవాలు ఫిబ్రవరి 1 నుంచి ఐదో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్మకర్త మండలి సమావేశం పాలకమండలి సమావేశం ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లు జంగాల శ్రీనివాసరావుతో కిషోర్ కుమార్ ఆవిష్కరించారు.

ఏపి ఎన్‌జిఒ అసోసియేషన్ కంచికచర్ల యూనిట్‌కు ఎన్నికలు

ప్రజాశక్తి-కంచికచర్ల

ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ కంచికచర్ల తాలూకా యూనిట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి, ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ పశ్చిమ కృష్ణ కార్యదర్శి సిహెచ్.దిలీప్ కుమార్ విడుదల చేసినట్లు కంచికచర్ల తాలూకా యూనిట్ అధ్యక్షులు ఎవి.శివారెడ్డి తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ఈ నెల 27న పబ్లిష్ చేయడం జరుగుతుందని, ఎన్నికలు డిసెంబర్ 11న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి తన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. తాలూకా యూనిట్ అధ్యక్షులు, అసోసియేట్ అధ్యక్షులతో సహా మొత్తం 11 పోస్టులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. కంచికచర్ల ఎన్జీవో హోంలో ఎన్నికలు జరుగుతాయని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు శివారెడ్డి తెలిపారు.

ఆయుర్వేద మందులు పంపిణీ

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ని గంటలపాడు గ్రామాల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ వై రత్న ప్రియదర్శిని, డాక్టర్ వాణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను పరీక్షించి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్తు కార్యాలయ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



బందరు కలెక్టరేట్‌లో...

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా): ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన భారతదేశం విరాజిల్లుతూ ఉందని, పటిష్టమైన మన రాజ్యాంగాన్ని తయారు చేసిన మహనీయులందరినీ స్మరించుకోవడం మన కర్తవ్యం అని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం మందిరంలో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ భారత రాజ్యాంగ ప్రస్తావనను చదివి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గత 20 రోజులుగా పాఠశాల, మండల, జిల్లా స్థాయిలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తత్వం, క్విజ్ పోటీలలో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రము, పతకాన్ని అందజేశారు. కెఆర్ఆర్‌సి ఎస్ డి సి శ్రీదేవి, జిల్లా విద్యాధికారి పివిజె రామారావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి చిన్న నరసింహులు, జిల్లా సైన్స్ అధికారి జాకీర్, కలెక్టరేట్ ఏవో రాధిక పాల్గొన్నారు.

అలాగే మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. టిడిపి సీనియర్ నాయకులు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, ఎస్సీ ఎస్టీ మైనార్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుమ్మడి విద్యాసాగర్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** కృష్ణా విశ్వవిద్యా లయం ఎన్ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభలో పలువురు అధికారులు పాల్గొని సందేశమిచ్చారు. రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగ అధిపతి డా. గోవాడ వీర్రాజు, ఎన్ ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం శ్రావణి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఆచార్య మారుతి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు

ప్రజాశక్తి-గుడివాడ : న్యాయ దినోత్సవం సందర్భంగా లాయర్లకు కోర్టు సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. తొలుత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కోర్టు సిబ్బంది చేత రాజ్యాంగ ప్రవేశికను చదివించారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ వాసుదేవ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి గాయత్రి, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి డి అరుంధతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి శ్రీనివాసులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ వైసిపి కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం 8వ వార్డు వద్ద ఉన్న అంబేద్కర్, జగజీవన్ రామ్ విగ్రహాలకు, అనంతరం సీతయలంక వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నలకుర్తి రమేష్, గ్రామ మాజీ సర్పంచ్ నలుకుర్తి పథ్వీరాజు పాల్గొన్నారు. అదేవిధంగా టిడిపి పార్టీ ఆధ్వర్యంలో 8వ వార్డు వద్ద అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా టిడిపి మండల పార్టీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టి బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి జడ్పీ హైస్కూల్లో జరిగిన వేడుకల్లో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జున రావు, తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్, ఎంపీడీఓ జంగం స్వర్ణభారతి, హెచ్ఎం జయంతి, ఎంఈఓ జీ.ఎన్.బీ గోపాల్ పాల్గొన్నారు. .**ప్రజాశక్తి-పెడన :** పెడన టౌన్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పెడన శాసనసభ్యులు కాగిత కష్ణ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ సెల్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి గూడూరు :** గూడూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ లింగం సులోచన రాణి, లింగం విజయకుమార్‌లు భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి టి వి భాస్కర్ రావు పాల్గొన్నారు. అలాగే మచిలీపట్నం లోని కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులులర్పించారు. మచిలీపట్నం అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్లు అబ్దుల్ మతీన్, అందే శ్రీ రామ్మూర్తి పాల్గొని భారత రాజ్యాంగ విశిష్టతను తెలిపారు. పిసిసి డెలిగేట్ నల్లబోలు కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, చిలుకోటి ప్రసాద్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లి పంచాయతీలోని నారాయణరావు నగర్ మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కైతేపల్లి దాస్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం రాజ్యాంగ దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అధ్యక్షురాలు కోట విజయ రాధిక, ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ లు పాల్గొన్నారు. నాటక అకాడమీ డైరెక్టర్, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, తెలుగుదేశం పార్టీ నేత బావిశెట్టి కనకదుర్గ, విద్యా కమిటీ చైర్మన్ మాచర్ల సీతామహాలక్ష్మి పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ :** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ సచివాలయంలో నిర్వహించారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్, పి. వి. ఫణి కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గౌడ వెల్ఫర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, కనకదుర్గ అమ్మవారి దేవస్థానం పాలకమండలి సభ్యులు వెలగపూడి శంకర్ బాబు ఆధ్వర్యంలో యనమలకుదురు లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మోఖపాటి శ్రీనివాసరావు, తాడిశెట్టి వీరాస్వామి, బుంగ బాలస్వామి, చిర్రావూరి శేషు, బుక్య రాజా , వీరంకి కుటుంబరావు, జన్ను నాగరాజు, యడ్లపల్లి సురేష్ పాల్గొన్నారు.



గుడివాడలో...



కంకిపాడు మండలంలో...

అలాగే భారత రాజ్యాంగమే యావత్తు దేశానికి శిరోధార్యమని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు అన్నారు. కంకిపాడులో బుధవారం గోగులమూడి రాజు ఆధ్వర్యంలో స్థానిక లాకులు వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి మహిళలు చేత పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ కే సరళ, టి,నాగరాణి,మాల మహానాడు నాయకులు సిరివెళ్ల చిట్టిబాబు, గోవాడ బెర్నార్డ్ షా పాల్గొన్నారు,**ప్రజాశక్తి-ఉయ్యూరు :** రాజ్యాంగాన్ని గౌరవిస్తూ బాధ్యతగల పౌరులుగా మెలగాలని కృష్ణా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్ ఆచార్య కూనా రాంజీ అన్నారు. బుధవారం మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఫ్లోరా స్కూలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ నూకల సాంబశివరావు, ఫ్లోరా స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంతు, సీనియర్ లెక్చరర్ సదాశివరావు, ఇంచార్జ లావణ్య, పాల్గొన్నారు. అలాగే ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆర్డీఓ బిఎస్. హేలాషారోన్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో అంబేద్కర్చిత్రపటానికి ఎంపీడీఓ శేషగిరిరావు పూలమాలవేసి నివా ళులర్పించారు. కడవకొల్లు లో అంబేద్కర్ విగ్రహం వద్ద స్థానికులతో కలసి ఎంపీడీఓప్రతిజ్ఞ చేయించారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** పెనమకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో హెచ్ఎం ఎస్.నాగేశ్వరరావు, మొదటి అసిస్టెంట్ వై.సురేష్, స్టాఫ్ సెక్రటరీ ఎన్. అరుణ, సోషల్ టీచర్ ఝాన్సీ పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులకు ఆటల పోటీలు, వకత్వ పోటీలు నిర్వహించారు. **ప్రజాశక్తి-మొవ్వ:** మొవ్వ లోని తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి తాసిల్దారు కే మస్తాన్, మొవ్వ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు మండవ రత్నగిరి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్ఐ విజయదుర్గ, ఎక్సైజ్ ఎస్సై లక్ష్మీకాంతం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవనిగడ్డ రెవెన్యూ డివిజన్ ఆశలు గల్లంతు : బడే గౌతం

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాలు, మరో ఐదు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు మంత్రుల కమిటీ సిఫారసుల మేరకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలపగా అందులో అవనిగడ్డ పేరు లేకపోవడంతో రెవెన్యూ డివిజన్ ఆశలు గల్లంతయినట్టేనని వైసిపి నియోజకవర్గ యువ నాయకులు బడే గౌతమ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాబినెట్లో ఆమోదం కూడా తెలిపి ముందుకు ప్రతిపాదనలను పంపి నోటిఫికేషన్ విడుదల చేయడానికి సిద్ధమయ్యారని తెలిపారు. కొద్ది రోజుల క్రితం మన ప్రాంతానికి చెందిన కూటమినేతలు కొందరు అవనిగడ్డలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారని, త్వరలోనే అవనిగడ్డ రెవెన్యూ డివిజన్ వచ్చేస్తున్నట్లు మీడియా వేదికగా ప్రచారం కూడా చేసుకున్నారన్నారు. కాగా ఇప్పుడు ప్రభుత్వ ప్రతిపాదన చూస్తుంటే వారు కేవలం ప్రచార ఆర్భాటమే చేశారు తప్ప రెవెన్యూ డివిజన్ సాధించే దిశగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఏ విధమైన కనీస ప్రయత్నం కూడా చేసినట్లు కనపడటం లేదని గౌతమ్ విమర్శించారు. ఇంకా నోటిఫికేషన్ విడుదల కానందున ఇప్పటికైనా మేల్కొని ఆమనగడ్డకు రెవిన్యూ డివిజన్ సాధించే ప్రయత్నాలు చేయాలని గౌతం విజ్ఞప్తి చేశారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం



ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నేత్ర దానం జరిగింది. చల్లపల్లి కి చెందిన అన్నవరపు శ్రీనివాసరావు అత్త మామిడి ఆదిలక్ష్మి మృతిచెందగా నేత్ర దానం ఆవశ్యకతను వాసవి క్లబ్ ప్రతినిధుల ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు నేత్ర దానం చేసేందుకు అంగీకరించారు. ఎల్వి ప్రసాద్ ఆసుపత్రికి చెందిన టెక్నీషియన్ సాయి చల్లపల్లి వచ్చి మతురాలు కళ్ళ నుంచి రెండు కార్నియాలను సేకరించారు. వాసవి క్లబ్ కార్యదర్శి గోళ్ళ వెంకటరత్నం, గ్రోళ్ళ ద్రోణ పూర్ణచంద్రరావు, తమ్మన సతీష్,ఉరిమి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై

కంట్రోల్ రూమ్ ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజనులో రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన కలక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 8247693551 ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ సూచించారు. ఈ ఖరీఫ్ సీజనులో కనీస మద్దతు ధర ప్రతి క్వింటాల్ ధాన్యముకు సాధారణ రకం రూ.2,369 చొప్పున, గ్రేడ్-ఏ రకానికి రూ.2,389 చొప్పున ప్రతి రైతునకు పూర్తి పారదర్శకంగా నేరుగా వారి బ్యాంకు అక్కౌంట్ కు ఆధార్ నెంబరు ఆధారంగా జమ చేస్తామన్నారు. రైతులందరూ వారి ధాన్యమును పూర్తిగా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఆరబెట్టుకుని తీసుకుని రావాలని సూచించారు.

ఆర్‌డిఒ కార్యాలయంలో రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి - గుడివాడ : జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ బుధవారం గుడివాడ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. వివిధ అంశాలకు సంబంధించిన రిజిస్టర్లు, నెలవారి నివేదికలు, పలు సర్వేల పురోగతి, కార్యాలయంలోని ఖాళీ పోస్టులు తదితర వివరాలపై గుడివాడ ఆర్డిఓ జి.బాల సుబ్రహ్మణ్యంను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆయన డిస్పాచ్ రిజిస్టర్, పే బిల్, ట్రెజరీ రీకన్సిలేషన్, ట్రెజరీ బిల్ రిజిస్టర్, టూర్ ప్రోగ్రాం, ల్యాండ్ అక్విజిషన్, ల్యాండ్ ఎంక్రోచ్మెంట్ యాక్ట్, ఆర్ఓఆర్, హౌస్ సైట్స్ తదితర రిజిస్టర్లను పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యాక్రమంలో ఆర్‌డివో కార్యాలయం ఏఓ బాలాజీ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : రైతులు పండించిన ప్రతి గింజ ప్రభుత్వ కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు ప్రభుత్వా డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొత్త మాజేరులో పర్యటించి రైతులను కలిసి పంటల దిగుబడిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యంత్రాలతో నూర్చిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపో యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి విపత్తుల కారణంగా నిత్యం రైతులు నష్టాన్ని చదువు చూడటంతో అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నష్టాలు పాలవుతున్న రైతులను అది ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వాన్ని సడలించి తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఈ పర్యటనలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, రైతులు కాగిత నాంచారయ్య బండి లక్ష్మి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-పామర్రు : రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు.మండల పరిధి పసుమర్రు గ్రామంలో 23 లక్షల నిధులతో నిర్మిస్తున్న ఓఎన్జిసి రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళు ్లగా నిర్మాణానికి నోచుకోని ఈ రహదారిని కూటమి ప్రభుత్వ హయాంలో నిర్మించడం గర్వంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో యార్డ్ చైర్మన్ బాబు, మాజీ సర్పంచ్ మురళి, గ్రామస్తులు అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి పామర్రు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణాలును వేగవంతం పూర్తి చేయనున్నట్లు హౌసింగ్ పీడీ ఎస్.పోతురాజు తెలిపారు. మండల పరిధిలోని కొండిపర్రు, రిమ్మనపూడి గ్రామాలలో ఉన్న లేఔట్లను బుధవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి మార్చి నాటికి ఇల్లు పూర్తి చేసుకోవాలని సకాలంలో బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కరెంటు లైన్లు కాలనీలో లేవని లబ్ధిదారులు తెలిపారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ఈ నెలాఖరులోపు కరెంటు లైన్ ఏర్పాటు చేయిస్తానని లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్హౌసింగ్ బుజ్జిబాబు, మార్కెటింగ్ యార్డ్ డైరెక్టర్ నుకారపు ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ విలాస్ మోడ్రన్ కేఫ్ పునః ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని బీసెంట్ రోడ్‌లో శ్రీ లక్ష్మీ విలాస్ మోడ్రన్ కేఫ్‌ను పునఃప్రారంభిస్తున్నట్లు హేజమాడి మురళీధరరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం శ్రీ లక్ష్మీ విలాస్ మోడ్రన్ కేఫ్‌లో శాంతి సంరక్షణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వస్త్ర దానం చేశారు. గుణదలలో ఉన్న బ్రెయిన్ స్కూల్ విద్యార్థులకు 24 ల్యాప్‌టాప్‌లు అందించారు. ఈ సందర్భంగా మురళాధరరావు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ విలాస్ మోడ్రన్ కేఫ్‌ను పునః ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం 63 నాన్ ఏసీ రూములు, 30 ఏసీ రూములు ఉన్నాయన్నారు. కొద్ది రోజుల్లో అలనాటి శ్రీలక్ష్మి విలాస్ రెస్టారెంట్ మోడ్రన్ కేఫ్ పాత రుచులు నేటితరానికి రుచి చూపించనున్నట్లు తెలిపారు. టిఫిన్స్‌తో పాటు రుచికరమైన భోజనం కూడా అందించనున్నట్లు తెలిపారు.



విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-విజయవాడ : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పాఠశాల విద్యాశాఖ నియోజకవర్గ స్థాయిలో క్విజ్, వక్తృత్వం, వ్యాస రచన విభాగాల్లో పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో విజేతలకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పతకాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ రాజ్యాంగ పీఠికను చదివి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు బాగా చదువుకొని మహనీయులు డా. బీఆర్ అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో అడుగులేస్తూ పయనించాలని.. జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో డిఇఒ సుబ్బారావు పాల్గొన్నారు.



ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : కొత్తపేట ఆంజనేయ వాగు శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి సన్నిధిలో షష్టి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం ఆలయ అర్చకులు డాక్టర్ విన్నకోట శ్రీనివాసరావు శర్మ ఆధ్వర్యంలో కార్తికేయునికి పసుపు, గంధం, విభూది వంటి పరిమళ ద్రవ్యాలతో పాటుగా వివిధ రకాల పండ్ల రసాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్టి సందర్భంగా భక్తులు స్వామివారికి వేకువ జాము నుంచే విశేష అభిషేకాలు, నిత్య కైకర్యాలు నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఇఒ వై సీతారామయ్య, ఆలయ చైర్మన్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు, పర్యవేక్షణలో నిర్వహించారు.

సఫాయి కర్మచారీ వాహనాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-విజయవాడ : ఎన్టీఆర్ జిల్లాలోని సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువత సబ్సిడీపై మురుగు శుద్ధి వాహనాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునే గడువును డిసెంబర్ 5వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులు షేక్ షాహిద్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎస్‌కెఇడిసి పథకం ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి వాహన వ్యయం రూ.31,67,326 అని, ఇందులో రూ.14,16,831.50 సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. మిగిలిన రూ.17,50,494.50 మొత్తాన్ని ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి ఋణంగా పొందవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు జిల్లా ఎస్సికార్పొరేషన్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 5 మంది కలిసి ఒక గ్రూపుగా ఏర్పడాలన్నారు. గ్రూపులోని ప్రతి సభ్యుడు సఫాయి కర్మచారి వత్తి దారుఅయి ఉండాలన్నారు. గ్రూపులో కనీసం ఒకరికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు 9652057244 నంబర్ ను సంప్రదించాలని చెప్పారు.

ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టిపెట్టండి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ ప్రవేశపెట్టిన రైతన్నా.. మీ కోసం! కార్యక్రమం స్ఫూర్తితో అడుగులేస్తూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టిపెట్టి రైతులకు ఎక్కడా ఇబ్బంది అనే మాట రాకుండా చూడాలని, సమష్టి కృషితో ముందుకెళ్లాలని జిల్లా డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో ఖరీఫ్ (2025-26) ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గోనె సంచులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలని, వాట్సాప్ (7337359375) షెడ్యూలింగ్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. బహుళ ప్రయోజనాలున్న ఏపీ ఏఐఎంఎస్ యాప్‌పైనా అవగాహన పెంపొందించి.. డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. రైతులతో గౌరవంగా మెలుగుతూ అవసరమైన సేవలు అందించాలని.. విస్తృత ప్రజాప్రయోజన కార్యక్రమాలకు సంబంధించి విధుల్లో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) ద్వారా ఈ ఏడాది అక్టోబర్ 17న ప్రారంభమైన కొనుగోళ్ల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ముందుకెళ్లేలా చూడాలన్నారు. ఇప్పటికే రూ. 49.70 కోట్ల విలువైన



20,818 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని.. ఇందులో మరింత వేగం పెంచి, లక్ష్యాలను చేరుకునేందుకు కషిచేయాలన్నారు. 12-24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము ఖాతాల్లో జమవుతోందని.. కొన్ని సందర్భాల్లో ఆరు గంటల్లోనే ధాన్యం సొమ్ము జమవుతున్న సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి 7702003571 నంబరుతో సహాయ కేంద్రం అందుబాటులో ఉందని.. ధాన్యం సేకరణ విషయంలో ఏ సమస్య ఉన్నా రైతులు ఈ నంబరుకు కాల్ చేయవచ్చన్నారు. సమావేశంలో పౌర సరఫరాల డీఎం టి.వి.సతీష్ కుమార్, పౌర సరఫరాల జిల్లా అధికారి ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, పాల్గొన్నారు.



అంతర్ జిల్లా ఖోఖో పోటీలకు గండేపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి-కంచికచర్ల : ఈ నెల 28న అనకాపల్లి జిల్లా పరవాడ మండలం లంకలపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరగనున్న అంతర్ జిల్లా ఖోఖో పోటీలకు కంచికచర్ల మండలం గండేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న పోతుగంటి రిషిక్ ఎంపికైనట్లు హెచ్ఎం సిహెచ్ రామకృష్ణ తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన పి మధు కాకినాడలో ఇటీవల జరిగిన అండర్ 17 ఖోఖో పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. ఇరువురు విద్యార్థులను బుధవారం పాఠశాలలో జరిగిన సత్కార కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, పాఠశాల పిడి రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది విశాలి తదితరులు అభినందించారు.

29 నుండి అధ్యాపకుల బ్యాడ్మింటన్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్


సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా 50వ ఎపి కాలేజి టీచర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నవంబర్ 29 నుంచి రెండురోజులపాటు విజయవాడ మొఘల్రాజ పురంలోని పి.బి.సిద్ధార్థ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్స్ డాక్టర్ మేకా రమేశ్, సిహెచ్.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ వేమూరి బాబురావు తెలిపారు. బుధవారం ఉదయం కళాశాలలో టోర్నీ పోస్టర్ ఆవిష్కరణలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల అనుబంధ వైద్య, దంత, ఫార్మా, ఇంజనీరింగ్, వ్యవసాయ, న్యాయ, శారీరక విద్య, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల బోధనా సిబ్బందికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్, వెటరన్ డబుల్స్ (45-55 సంవత్సరాలు), సూపర్ వెటరన్ డబుల్స్ (55 ఏళ్ళ వయసు పైబడిన వారు), మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్ నాకౌట్ కమ్ లీగ్ విధానంలో నిర్వహిస్తామని, ఇతర మ్యాచ్‌లు నాకౌట్ ప్రాతిపదికన నిర్వహిస్తామని చెప్పారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగాధిపతులు డా. టి.వి.బి. కష్ణారెడ్డి, మార్కండేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రెడాయ్ ప్రాపర్టీ షోకు హాజరవ్వండి

- సిఎం చంద్రబాబుకు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని పరుగులు తీయించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంస్కరణలు తీసుకొచ్చారని ద కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) విజయవాడ చాప్టర్ చైర్మన్ సి.సతీష్ బాబు, అధ్యక్షులు జివిఎస్ఆర్ మోహన్‌రావు, కార్యదర్శి కె.రఘురామ్ అన్నారు. బుధవారం వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్(చిన్ని)తో కలిసి పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా 2026 జనవరిలో జరగబోయే 2026- క్రెడాయ్ ప్రాపర్టీ షోకు హాజరు కావాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం చంద్రబాబు నేతృత్వంలో తీసుకున్న నిర్ణయాలు రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించేలా ఉన్నాయన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం వల్ల నిర్మాణ రంగం కూడా వృద్ధి చెందుతోందని తెలిపారు. క్రెడాయ్ ప్రాపర్టీ షో ద్వారా ప్రజలకు రియల్ ఎస్టేట్ రంగంపై విస్తృత అవగాహన పెంపొందించాలనే ఆలోచనతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో క్రెడాయ్ విజయవాడ చాప్టర్ ఉపాధ్యక్షుడు బి.పవన్, సభ్యులు పి.శ్రీనివాస్ రాజు తదితరులు ఉన్నారు. క్రెడాయ్ ప్రాపర్టీ షోకు హాజరవ్వాలనే అభ్యర్థనపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు.



జాతీయ క్రీడల నిర్వహణకే స్టేడియాల అభివృద్ధి

- ఎపి కేశినేని శివనాథ్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆటల పోటీలను నగరంలోనే నిర్వహించే విధంగా క్రీడా మైదానాలు, ఇండోర్ స్టేడియాలను తీర్చిదిద్దు తున్నామని విజయ వాడ ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. బుధవారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని పటమట హైస్కూల్ రోడ్డులోని చెన్నుపాటి రామకోయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియం ఆధునీకరణ పనులను ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ అమరావతిలో జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో క్రీడా మైదానాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 2029 నేషనల్ గేమ్స్‌ను విజయవాడలో నిర్వహించేలా స్టేడియాలను అభివద్ధి చేస్తామని తెలిపారు. గద్దె రామమోహన్ మాట్లాడుతూ నేషనల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నగరంలో నిర్వహించడం చాలా గర్వకారణంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, రాష్ట్ర బ్యాట్మెంటన్ అసోసియేషన్ సెక్రటరీ అంకం చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



సోషల్ మీడియా ప్రభావంపై వ్యాస రచన పోటీలు

విజయవాడ : సూర్యారావుపేటలోని బిషప్ అజరయ్య గర్ల్స్ హైస్కూల్‌లో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన విద్యార్థులకు "బాలలపై సోషల్ మీడియా ప్రభావం" అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్‌కె నాజ్మ మాట్లాడుతూ సోషల్ మీడియా విద్యార్థుల జీవితాల్లో అంతర్భాగంగా మారిందని, వారి మానసిక ఆరోగ్యం, విద్యా పనితీరు, వ్యక్తుల మధ్య సంబంధాలను దెబ్బతీస్తుందని, అనేక ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ.. ఇది గణనీయమైన సవాళ్లను కూడా కలిగిస్తుందని తెలిపారు. హైస్కూల్ ప్రిన్సిపాల్ జయశ్రీ మాట్లాడుతూ వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. అనంతరం పోటీల్లో విజేతలైన సంధ్య, మాధురి, సింధూలకు బహుమతులు అందజేశారు.



జాతీయ స్థాయి పోటీల్లో అక్షర ప్రతిభ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఒరిస్సాలో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగిన 3వ గో గేమ్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో పోరంకి భాష్యం విద్యార్థి ఆళ్ల అక్షర ప్రతిభ కనపరచిందని కోచ్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపరచిన చిన్నారిని పలువురు అభినందించారు. అక్షర ప్రస్తుతం ఏడవ తరగతి చదువుతుందని తెలిపారు. అక్షర ఆంధ్రప్రదేశ్ తరఫున గో గెమ్ నేషనల్‌లో గత రెండు సంవత్సరాలుగా వరుసగా గోల్డ్ మెడల్ సాధించడం జరిగిందన్నారు. ఈ ఏడాది జరిగిన పోటీలలో మూడోసారి కూడా గోల్డ్ మెడల్ సాధించి హ్యాట్రిక్ సాధించిందని తెలిపారు. కోచ్ పి.ప్రసాద్ ఆధ్వర్యంలో కోచింగ్ తీసుకుని గెలవడం అభినందనీయమని తల్లిదండ్రులు, పలువురు నగర ప్రముకులు అభినందనలు తెలిపారు.

